సాక్షి ఖమ్మం

ఆదివారం । 17 । ఆగస్టు । 2025



అథారిటీతోనే అభివృద్ధి

భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయానికి అథారిటీని ఏర్పాటుచేస్తేనే అభివృద్ధి పనుల్లో వేగం పెరగనుంది. 8లో



సకాలంలో బెనిఫిట్లు..

సంస్థలో రిటైర్డ్ ఉద్యోగులకు సకాలంలో బెనిఫిట్లు అందజేయాలని సింగరేణి సీఎండీ బలరామ్ ఆదేశించారు. 8లో

గరిష్ఠం / కనిష్ఠం 28° / 24°

వాతావరణం

జిల్లాలో ఆదివారం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. కొన్ని ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

శ్రీవారికి అభిషేకం, నిత్యకల్యాణం



స్వామిని దర్శించుకుంటున్న భక్తజనం

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. తెల్లవారుజామునే స్వామి మూలవిరాట్‌తో పాటు ఆలయ ఆవరణలోని శ్రీవారి పాదానికి అర్చకులు పంచామృతంతో అభిషేకం జరిపించారు. ఆతర్వాత స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించి వేలాదిగా హాజరైన భక్తుల సమక్షాన నిత్యకల్యాణం, పల్లకీసేవ నిర్వహించారు. అలాగే, శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని గోకులంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ ఈఓ జగన్మోహన్‌రావు, వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి, అర్చకులు రాజీవ్‌శర్మ, మురళీమోహన్‌శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ధరలు పెంచితే చర్యలు



షాప్‌లో ఎరువులు పరిశీలిస్తున్న డీఏఓ పుల్లయ్య

ముదిగొండ: యూరియా స్టాక్ లేదంటూ డీలర్లు ధరలు పెంచి అమ్మితే చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ శాఖాధికారి డి.పుల్లయ్య హెచ్చరించారు. ముదిగొండ మండలంలోని పలు గ్రామాల్లో ఎరువుల దుకాణాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిల్వలు, రిజిస్టర్లను పరిశీలించి డీలర్లకు సూచనలు చేశారు. స్టాక్ వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేస్తూ నిర్ణీత ధరకే ఎరువులు అమ్మాలని సూచించారు. అలాగే, నానో యూరియా వాడకంపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఏఓ సరిత పాల్గొన్నారు.

పల్లిపాడులో పత్తి చేనులోకి చేరిన వరద



పాలేకలలో పరిశీలిస్తున్న డీపీఓ ఆశాలత



వైరా రాజీవ్‌నగర్‌లోని ఇళ్లలోకి చేరిన వరద నీరు



పేరుపల్లి నుంచి స్థానికులను తరలిస్తూ..



వానొచ్చే.. వరదొచ్చే

ఎగువ జిల్లాల్లో భారీ వర్షానికి తోడు జిల్లాలోనూ శుక్రవారం రాత్రి కురిసిన వర్షంతో వరద పెరిగింది. మున్నేరు, ఆకేరు, వైరా, పాలేరు వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండగా వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. పలుచోట్ల లోలెవల్ వంతెనలపైకి వరద చేరడంతో గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. ఈమేరకు అధికారులు వరద పరిస్థితిని తెలుసుకుంటూ ముందస్తు చర్యల్లో నిమగ్నమయ్యారు.

– సాక్షి ప్రతినిధి, ఖమ్మం

- ఎగువన వర్షాలతో మున్నేరు, ఆకేరుకు భారీగా వరద
- నిండుకుండల్లా పాలేరు, వైరా రిజర్వాయర్లు, చెరువులు
- పలుచోట్ల రోడ్లపైకి నీరు చేరడంతో రాకపోకలకు బ్రేక్
- మున్నేటి వరదను పరిశీలించిన కలెక్టర్, కమిషనర్



కాల్వొడ్డు వద్ద మున్నేటిలో ప్రవాహం



బొక్కలగడ్డ వాసులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ అనుదీప్, కేఎంసీ కమిషనర్ అభిషేక్

ఎక్కడెక్కడ ఎలా?

- ఎగువన భారీ వర్షంతో మున్నేటికి వరద పెరిగింది. శనివారం ఉదయం 7గంటలకు కాల్వొడ్డు ఫ్లడ్ గేజ్ వద్ద 9.5 అడుగులుగా ఉన్న నీటిమట్టం మధ్యాహ్నం12 గంటలకు 12.5, ఒంటి గంటకు 13, సాయంత్రం 4.30గంటల సమయాన 14.5 అడుగులకు, 6గంటలకు సమయాన 15అడుగులకు చేరడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. మహబూబాబాద్ జిల్లాలో భారీ వర్షంతో మున్నేరు, ఆకేరులకు వరద భారీగా చేరుతోంది. దీంతో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, కేఎంసీ, ఏదులాపురం కమిషనర్లు అభిషేక్‌అగస్త్య, శ్రీనివాసరెడ్డి ఇరువైపులా పరిశీలించి స్థానికులకు సూచనలు చేశారు. నీటిమట్టం 16అడుగులు దాటితే ప్రభావిత ప్రాంత ప్రజలకు పునరావాస కేంద్రాలకు తరలించాలని సిబ్బందిని ఆదేశించారు.
- కొణిజర్ల మండలం తీగలబంజరవద్ద పగిడేరు ఉధృతంగా ప్రవహించడంతో పల్లిపాడు – ఏన్కూరు రోడ్డులో రాకపోకలు నిలిచిపోయాయి. తల్లాడ మండలం బిల్లుపాడు – రామచంద్రాపురం మధ్య వాగు లోలెవల్ బ్రిడ్జి పైనుంచి ఉధృతంగా ప్రవహించడంతో రామచంద్రాపురం, వెంగన్నపేటకు రాకపోకలు బంద్ అయ్యాయి. మిట్టపల్లి వద్ద గంగదేవిపాడు వాగు పొంగి ప్రవహిస్తోంది.
- కారేపల్లి మండలం పేరుపల్లి వద్ద బుగ్గవాగు ఉధృతితో లోలెవల్ బ్రిడ్జి మునిగింది. దీంతో పేరుపల్లి – మాదారం మధ్య రాకపోకలు నిలిచాయి. ఈ గ్రామాల సమీపాన డబుల్‌బెడ్ రూం ఇళ్లకు వరద తాకడంతో స్థానికులను పునరావాస కేంద్రాలకు తరలించారు.
- వైరా రిజర్వాయర్ నిండుకుండలా మారడంతో ఐదు అలుగుల ద్వారా వరద బయటకు వెళ్తోంది. ఈ వరద దిగువన వాగులోకి చేరడంతో సోన్నాలలక్ష్మీపురం, సిరిపురం, పుణ్యాపురం, గన్నవరం, ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా నెమలి గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. వైరా రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటిమట్టం 18.3 అడుగులు కాగా 20 అడుగులకు చేరింది. ఈ కారణంగా రాజీవ్‌నగర్‌కాలనీకి వరద చేరడంతో నిర్వాసితులను పునరావాస కేంద్రానికి పంపించారు.



వైరా పునరావాస కేంద్రంలో భోజనం వడ్డిస్తున్న అధికారులు

- మున్నేరు, పాలేరుకు వరద పెరగడంతో అడిషనల్ డీసీపీ ప్రసాదరావు పరిశీలించారు. నీట మునిగిన రోడ్లు, వాగులు దాటకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. వరద ఉధృతి ఎక్కువ ఉన్న వాగుల వద్ద పెట్రోలింగ్ ఏర్పాటు చేయాలని తెలిపారు.
- పాలేరు రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 23 అడుగులు కాగా 23.25 అడుగులు, లంకాసాగర్ 16 అడుగులకు గాను 14.8 అడుగుల మేర వర ద చేరింది. జిల్లాలోని 1,061 చెరువులకు గాను 326 చెరువులు పూర్తిగా నిండి అలుగుపోస్తున్నా యి. 222 చెరువులు 90–100 శాతం, 205 చెరువులు 75–నుంచి 90శాతం వరకు నిండాయి.
- జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8–30 గంటల నుంచి శనివారం ఉదయం 8–30 గంటల వరకు వర్షం దంచికొట్టింది. జిల్లా వ్యాప్తంగా సగటున 2.7 సె.మీ. వర్షపాతం నమోదైంది. అత్యధికంగా కొణిజర్లలో 7సెం.మీ, కారేపల్లిలో 6.1, వైరాలో 5.5, కూసుమంచిలో 4.7, కామేపల్లిలో 4.6, ఏన్కూరులో 4.2, రఘునాథపాలెంలో 4.0, ముదిగొండలో 3.3, నేలకొండపల్లిలో 3.2, ఖమ్మంఅర్బన్‌లో 3 సెం.మీటర్ల వర్షపాతం నమోదైందని అధికారులు వెల్లడించారు.
- మున్నేటికి అంతకంతకూ వరద పెరుగుతున్న కలెక్టర్, సహా అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. హైదరాబాద్ నుంచి అధికారులతో సమీక్షించిన ఆయన వరద ముప్పు, పరీవాహక ప్రాంతాల ప్రజలను అవసరమైతే పునరావాస కేంద్రాలకు తరలించడంపై సూచనలు చేశారు.

ప్రజలను అప్రమత్తం చేయండి

పోలీసు కమిషనర్ సునీల్‌దత్



పోలీసులకు సూచనలు చేస్తున్న సీపీ

ఖమ్మం క్రైం: మున్నేటిలో వరద ఉధృతి నేపథ్యాన పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు సూచనలు చేయాలని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ ఆదేశించారు. ఖమ్మంలోని కాల్వొడ్డు ప్రాంతంలో శుక్రవారం రాత్రి పర్యటించిన ఆయన ఉద్యోగులకు సూచనలు చేశారు. పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఎలాంటి నష్టం జరగకుండా చూడాలని తెలిపారు. అలాగే, చెరువులు, వాగుల ఉధృతి దృష్ట్యా ప్రజలెవరూ రోడ్డు దాటే ప్రయత్నం చేయొద్దని, చేపల వేటకు వెళ్లొద్దని సూచించారు. అత్యవసర సమయాల్లో డయల్ 100 లేదా పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ 87126 59111, కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్ 1077, 90632 11298 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సీపీ తెలిపారు.

అదనపు డీసీపీ పరిశీలన

ఖమ్మంరూరల్/కూసుమంచి: ఖమ్మం రూరల్ మండలం నాయుడుపేట వద్ద మున్నేటిని, కూసుమంచి మండలంలోని పాలేరు రిజర్వాయర్‌ను అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఉద్యోగులకు సూచనలు చేయడంతో ప్రజలను అప్రమత్తం చేసేలా ఆదేశాలు జారీ చేశారు. ఈకార్యక్రమాల్లో ఏసీపీ తిరుపతిరెడ్డి, సీఐలు ముష్కరాజు, సంజీవ్, ఎస్సై నాగరాజు పాల్గొన్నారు.

నామినేషన్ల స్వీకరణ షురూ

పాల్వంచ: టీజీ జెన్‌కో పరిధిలోని తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ అసిస్టెంట్ ఇంజనీర్స్ అసోసియేషన్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ శనివారం ప్రారంభమైంది. రెండేళ్ల కాలపరిమితితో కూడిన ఈ ఎన్నికలు రాష్ట్రంలోని 25ప్రాంతాల్లో ఈనెల 30న నిర్వహించనుండగా.. 19వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ఓట్ల లెక్కింపు కేటీపీఎస్‌లో సెప్టెంబర్ 2న చేపడతారు. తొలిరోజు కేటీపీఎస్ ఐదో దశకు చెందిన ఏఈ జి.కీర్తి ఫైనాన్స్ సెక్రటరీ పదవికి, 7వ దశకు చెందిన ఏఈ పి.నవీన్ జాయింట్ సెక్రటరీ(థర్మల్) పదవికి నామినేషన్లు దాఖలు చేశారు.

కీలక పదవులు ఖాళీ...

- జలవనరుల శాఖలో అధికారుల కొరత
- ఉమ్మడి జిల్లాలో ఖాళీగా 8 ఈఈ పోస్టులు



ఖమ్మంలోని జలవనరులశాఖ కార్యాలయం

ఖమ్మంఅర్బన్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో జలవనరుల శాఖను అధికారుల కొరత వేధిస్తోంది. కీలక పోస్టులు ఖాళీగా ఉండడంతో సాగునీటి పంపిణీ పర్యవేక్షణలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కొంతకాలంగా అధికారులు రిటైర్ అవుతుండగా.. ఆ స్థానాలను భర్తీ చేయకపోవడంతో ఎనిమిది ఈఈ పోస్టులు ఖాళీ అయ్యాయి. పలువురికి ఎస్‌ఈలుగా పదోన్నతి లభించడంతో కొరత మరింత పెరిగింది.

కీలకమైన సమయమిది...

ఓవైపు వానాకాలం పంటల సాగు ముమ్మరంగా సాగుతోంది. సాగర్ నుంచి నీరు విడుదలవుతుండగా.. జిల్లాలోనూ భారీ వర్షాలతో ప్రాజెక్టులు, చెరువులు జలకళ సంతరించుకున్నాయి. ఈ సమయాన సాగునీటి సరఫరా, పర్యవేక్షణలో కీలకంగా వ్యవహరించాల్సిన అధికారులు లేకపోవడంతో రైతులకు సమస్యలు ఎదురవుతున్నాయి. జిల్లాలోని పలు డివిజన్ల పరిధిలో సకాలంలో సాగునీరు సదుపాయం అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు. మరోపక్క కీలకపోస్టులు ఖాళీగా ఉండటంతో ఉన్న ఉద్యోగులపై భారం పడి ఇబ్బంది ఎదుర్కొంటున్నారు.

సీఈ పోస్టూ ఖాళీనే...

ఖమ్మం జలవనరుల శాఖ సీఈ పోస్టు కూడా కొద్దినెలలుగా ఖాళీగా ఉంది. ప్రస్తుతం సూర్యాపేట సీఈ, జలవనరుల శాఖ ఈఎన్‌సీ రమేష్‌బాబు ఇక్కడ అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అంతేకాక పాలేరు, మధిర, కల్లూరు ఈఈ పోస్టులు, ఖమ్మం డీసీఈ, కల్లూరు డిప్యూటీ ఎస్‌ఈ పోస్టులూ మార్చి నుంచి ఖాళీగానే ఉన్నాయి. మరోపక్క కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం డివిజన్లలో ఈఈ, డీఎస్‌సీ పోస్టులు కూడా ఇటీవల పదోన్నతుల కారణంగా ఖాళీ అయ్యాయి. ఈ మేరకు ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ప్రభుత్వం స్పందించి జలవనరుల శాఖలో ఇంజనీరింగ్ అధికారుల పోస్టులను భర్తీ చేయాలని రైతులు కోరుతున్నారు.

గోకులకృష్ణా.. గోపాలకృష్ణా



ఖమ్మం ఆలయంలో ప్రత్యేక అలంకరణలో శ్రీ కృష్ణుడు



దర్శనానికి బారులు దీరిన భక్తులు

కృష్ణాష్టమి పర్వదినాన్ని జిల్లా వాసులు శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే, తల్లిదండ్రులు తమ పిల్లలను కృష్ణుడు, గోపిక వేషధారణలతో అలంకరించి మురిసిపోయారు. పలు ప్రాంతాల్లో సాయంత్రం ఉట్టి కొట్టే వేడుక నిర్వహించగా యువత ఉత్సాహంగా పాల్గొన్నారు.

– ఖమ్మం గాంధీచౌక్



శ్రీ కృష్ణుడు, గోపిక వేషధారణలతో చిన్నారులు

రొట్టమాకురేవు నుంచి ఎర్రకోటకు..



ఎర్రకోట వద్ద వేడుకల్లో సుహాసిని

కారేపల్లి: మారుమూల ఆదివాసీ గ్రామానికి చెందిన మహిళ దేశ రాజధానిలోని ఎర్రకోట వద్ద జరిగిన స్వాతంత్య్ర సంబురాల్లో పాల్గొంది. కారేపల్లి మండలం రొట్టమాకురేవు గ్రామానికి చెందిన ఇర్ప సుహాసిని గతంలో జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా వ్యవహరించింది. అలాగే, గ్రామంలో గోదావరి సమాఖ్య ద్వారా మహిళలకు పొదుపు, రుణాల మంజూరు, చెల్లింపునకు చేసిన కృషికి గాను ఎర్రకోట వద్ద జరిగే స్వాతంత్య్ర వేడుకలకు ఆహ్వానించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న సుహాసిని మాట్లాడుతూ ఢిల్లీలో ప్రధాని జాతీయ జెండా ఎగురవేయడాన్ని స్వయంగా చూడడం ఆనందాన్ని కలిగించిందని తెలిపారు.

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారికి శనివారం సువర్ణ తులసీ అర్చన వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన పూజలు చేశారు. అనంతరం చిత్రకూట మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. ఆతర్వాత నిత్య కల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు.

అందాలు చూద్దాం.. ఆస్వాదిద్దాం


- కొత్తదనం సంతరించుకున్న పులిగుండాల
- ఘాట్‌రోడ్డులో ప్రయాణం.. సఫారీపై స్వారీ
- అనేక రకాల రుద్దైన పక్షులు, ఔషధ మొక్కలకు ఆలవాలం
- ఉమ్మడి జిల్లా వాసులకు అందుబాటులో పర్యాటక కేంద్రం




అందాలతో కనువిందు చేస్తున్న పులిగుండాల ప్రాజెక్టు

సండే స్పెషల్

సత్తుపల్లి: కనుచూపు మేర పచ్చని చెట్లు.. చల్లనిగాలులు.. పక్షుల కిలకిలారావాలు.. జాలువారే జలపాతాలు.. ఘాట్‌రోడ్‌పై వెళ్తుంటే మార్గమధ్యలో ఆలయాలు.. దూరంగా ఉమ్మడి జిల్లాకు సరిహద్దుగా కనిపించే కనిగిరి గుట్టలు.. అక్కడక్కడా అరుదైన నీలిరంగు పుట్టగొడుగులు, ఔషధ మొక్కలు.. ఈ అనుభూతులన్నీ మీ సొంతం కావాలంటే ఒక రోజు సమయం కేటాయించండి చాలు! ఎంతో దూరం వెళ్లాల్సిన పనికూడా లేదు. కుటుంబ సమేతంగా పెనుబల్లి మండలం పులిగుండాల ప్రాజెక్టు సందర్శనకు వెళ్తే మరిచిపోలేని అనుభూతులను మూటగట్టుకుని రావొచ్చు! ఈ ప్రాంతాన్ని ఎకో టూరిజంలో భాగంగా రూ.4.20కోట్ల నిధులతో పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే పనులు కొనసాగుతున్నాయి. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెండు జిల్లాల కలెక్టర్లు అనుదీప్ దురిశెట్టి, జితేష్ వి.పాటిల్, ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్, కొత్తగూడెం ఎస్పీ రోహిత్‌రాజ్, అటవీ శాఖ భద్రాద్రి జోన్ సీసీఎఫ్ భీమా నాయక్, డీఎఫ్ఓ సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్, ఎఫ్‌డీఓ మంజుల తరచూ పర్యవేక్షిస్తుండడంతో పర్యాటకులకు ఒక్కటొక్కటిగా సౌకర్యాలు సమకూరుతూ ఉమ్మడి జిల్లా వాసులకు కొత్త పర్యాటక కేంద్రం అందుబాటులోకి వచ్చినట్లయింది.



జలపాతం..



లియోపార్డ్ టవర్

మనస్సును ఆహ్లాదపరిచేలా..

పులిగుండాల ప్రాజెక్టు వద్దకు వెళ్తే అన్ని బాధలు, కష్టాలు మరిచిపోవడమే కాక మనస్సు ఆహ్లాదంగా మారుతుంది. మార్గమధ్యలో ఎలుగుబంటి, దుప్పులు, కణుజులు, అడవిపిల్లులు, జంగుపిల్లులు, పునుగు పిల్లులు, మూషిక జింక, నెమళ్లను చూడొచ్చు. సముద్ర మట్టానికి 700 అడుగుల ఎత్తులో నిర్మించిన లియోపార్డ్ టవర్ నుంచి చూస్తే అటవీ అందాలతో పాటు చిరుతపులి కదలికలూ అప్పుడప్పుడు కనిపిస్తాయి.

ప్రత్యేక బస్సు.. అడ్వాన్స్ బుకింగ్

పులిగుండాల ప్రాజెక్టు సందర్శన కోసం ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించారు. ప్రతీ శని, ఆదివారం వి.ఎం.బంజరు బస్టాండ్ నుంచి అటవీశాఖ ఏర్పాటు చేసిన బస్సులు ఉదయం 9, 9.30 గంటలకు, కల్లూరు బస్టాండ్ నుంచి 11, 11.30 గంటల సమయాన బయలుదేరి రామకృష్ణాపురం వరకు వెళ్తాయి. బ్రహ్మళ్లకుంట ముఖద్వారం నుంచి అటవీశాఖ ఏర్పాటు చేసిన సఫారి వాహనంలో ప్రయాణిస్తూ అటవీ అందాలను తిలకించవచ్చు. టికెట్ ధర పెద్దలకు రూ.20, పిల్లలకు రూ.10గా నిర్ణయించారు. అలాగే, 94412 18466 నంబర్ ద్వారా అడ్వాన్స్ బుకింగ్ సౌకర్యమూ కల్పించారు. సొంత వాహనంలో వచ్చే పర్యాటకులు సఫారీ వాహనంలోనే వెళ్లాల్సి ఉంటుంది.

27 కిలోమీటర్ల ప్రయాణం

పెనుబల్లి మండలం బ్రహ్మళ్లకుంట ముఖద్వారం నుంచి 27 కిలోమీటర్లు ఘాట్‌రోడ్డులో అటవీశాఖ ఏర్పాటు చేసిన సఫారి వాహనంలో ప్రయాణం అద్భుతంగా సాగుతుంది. అటవీశాఖ అభివృద్ధి చేసిన హట్లలో విశ్రాంతి తీసుకునే అవకాశముంది. ఎవరూ ఇబ్బంది పడకుండా టాయిలెట్లు, తాగునీటి సదుపాయం కల్పించారు. మూడు వాచ్ టవర్లు, సెల్ఫీపాయింట్, రాత్రి బస కోసం నైట్ క్యాంపింగ్ సైట్, సోలార్ బోరు ఏర్పాటు చేశారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యాన రిసెప్షన్ హట్(భోజనశాల), అటవీ ఉత్పత్తుల విక్రయ స్టాల్ కూడా ఉంది. కాగా, చంద్రుగొండ మండలం బెండాలపాడు సమీపాన కనిగిరి గుట్టలపై 11వ శతాబ్దంలో ప్రతాపరుద్రుడు నిర్మించిన భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయం.. అక్కడ మోటబావిని కూడా చూడొచ్చు. అలాగే, పులిగుండాల ప్రాజెక్టు సమీపాన శివాలయంలో పూజలు చేసే అవకాశముంది.



బ్రహ్మళ్లకుంట వద్ద పులిగుండాల ముఖద్వారం



అటవీశాఖ బస్సు



పులిగుండాల ప్రాజెక్టులో బోటుషికారు

క్లుప్తంగా

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, పౌర సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం నుంచి ఖమ్మంలో జిల్లాలో మొదలయ్యే మంత్రి పర్యటన కూసుమంచి, నేలకొండపల్లి మండలాలతో పాటు ఏదులాపురం మున్సిపాలిటీ, ఖమ్మంలో కొనసాగుతుంది. ఆతర్వాత సాయంత్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మణుగూరు, లక్ష్మీదేవిపల్లి మండలు, కొత్తగూడెం కార్పొరేషన్లలో జరిగే పలు ప్రైవేట్ కార్యక్రమాలకు మంత్రి హాజరవుతారు.

సూర్యతండాను సందర్శించిన వైద్యాధికారులు


చిన్నారులను పరీక్షిస్తున్న వైద్యుడు, సిబ్బంది

రఘునాథపాలెం: మండలంలోని సూర్యతండాకు చెందిన పలువురు చిన్నారులు వాంతులు, విరోచనాలతో అస్వస్థతకు గురైన విషయమై 'సాక్షి'లో శనివారం కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన వైద్యాధికారి బాలకృష్ణ, ఏఎన్ఎం రత్నకుమారి, ఆశా కార్యకర్తలతో కలిసి గ్రామానికి వెళ్లి పరిస్థితులపై ఆరా తీశారు. అస్వస్థతకు గురైన చిన్నారులను పరీక్షించి మాట్లాడారు. ఇద్దరు చిన్నారులు ఇప్పటికే కోలుకోగా, మరో ఇద్దరు ఖమ్మంలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. వర్షాలు కురుస్తున్నందున వేడిచేసి చల్లార్చిన నీరే తాగించాలని, ఆహారం విషయంలోనూ జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ బాలకృష్ణ సూచించారు.

వాజ్‌పేయి ఆశయ సాధనకు కృషి


నివాళులర్పిస్తున్న నాయకులు


ఖమ్మం మామిళ్లగూడెం: మాజీ ప్రధాని వాజ్‌పేయ్ ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరు కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు కోరారు. మాజీ ప్రధాని వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా శనివారం ఖమ్మంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కోటేశ్వరరావు దేశ రాజకీయాలను సన్మార్గంలో నడిపించిన మహానేత వాజ్‌పేయి అని కొనియాడారు. ఈకార్యక్రమంలో బీజేపీ నాయకులు గెంటేల విద్యాసాగర్, అల్లిక అంజయ్య, వేరేల్లి రాజేష్‌గుప్త, మేకల నాగేందర్, కుమిలి శ్రీనివాస్, గడిల నరేష్, రామకృష్ణ, యుగంధర్, రుద్రగాని మాధవ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లొచ్చేసరికి చోరీ

చింతకాని: మండలంలోని వందనం గ్రామానికి షేక్ సైదాబీ ఇంట్లో శనివారం చోరీ జరిగింది. ఆమె ఖమ్మం ఆస్పత్రికి వెళ్లగా.. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. ఇంట్లోని సామగ్రిని ధ్వంసం చేయడమే కాక బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఖమ్మం నుంచి వచ్చాక చోరీ జరిగినట్లు సైదాబీ గుర్తించగా.. ఆమె కుమారుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

ఏడుబావుల వద్ద జిల్లా యువకుడి గల్లంతు

బయ్యారం: మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం ఏడుబావుల వద్ద శనివారం ఓ యువకుడు గల్లంతయ్యాడు. ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలం జెన్నారం ఎస్టీ కాలనీకి చెందిన ప్రాపర్తి ప్రేమ్‌కుమార్ తన బంధువులు, స్నేహితులతో కలిసి ఏడుబావుల జలపాతం చూసేందుకు వచ్చాడు. జలపాతం వద్ద పైన ఉన్న బావులను చూసేందుకు వెళ్తున్న క్రమాన ప్రేమ్ ప్రమాదవశాత్తు జారి బావిలో పడినట్లు తెలుస్తోంది. ఆయన సహచరులు ఎంత గాలించినా ప్రేమ్‌కుమార్ ఆచూకీ లభించలేదు. ఇంతలోనే చీకటి పడడంతో గాలింపు చర్యలకు అంతరాయం ఏర్పడింది.



పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.18,052


రఘునాథపాలెం : వీఆర్ బంజర- పాపటపల్లి మధ్య బుగ్గవాగు ప్రవాహం


ఏన్కూరు : జన్నారం - అంజనాపురం మధ్య ప్రవాహం


తల్లాడ : బిల్లుపాడు-రామచంద్రాపురం మధ్య ప్రవహిస్తున్న వరద

పోటెత్తి.. రోడ్లపైకి చేరి

- పలు చోట్ల నిలిచిన రాకపోకలు
- ఇళ్లలోకీ వరద రావడంతో ప్రజల ఆందోళన


నేలకొండపల్లి : చెరువు ప్రవాహంతో కొట్టుకుపోయిన రహదారి


ఖమ్మం రూరల్ : మున్నేటి వరదను పరిశీలిస్తున్న అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు


వైరా రిజర్వాయర్ వద్ద స్థానికులు

వైరా: వైరా రిజర్వాయర్‌కు వరద పోటెత్తుతోంది. పూర్తి స్థాయి నీటి మట్టం 18.3 అడుగులు కాగా ప్రస్తుతం 20అడుగులకు ఉంది. రిజర్వాయర్‌లోకి సామర్థ్యానికి మించి నీరు చేరడంతో రాజీవ్‌నగర్ కాలనీలోకి వరద చేరగా స్థానికులను జెడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలకు తరలించారు. మున్సిపల్ కమిషనర్ చింతా వేణు, తహసీల్దార్ కే.వీ.శ్రీనివాస్, ఎస్సై రామారావు ఆధ్వర్యాన పరిశీలించి వసతులు కల్పించారు.

● కొణిజర్ల: మండలంలోని పలు గ్రామాల మీదుగా ప్రవహించే పగిడేరు ఉధృతితో పలు గ్రామల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. శనివారం మధ్యాహ్నానికి వాగు ఉధృతి తగ్గడంతో రాకపోకలు ప్రారంభమయ్యాయి. కాగా, పగిడేరు, నిమ్మవాగు వరద ఉధృతితో వైరా రిజర్వాయర్‌కు భారీగా వరద చేరగా, సమీపంలోని పెద్దరాంపురం ఇళ్లలోకి నీరు చేరింది. అలాగే, పలుచోట్ల పంటలు నీటమునిగాయి.

● రఘునాథపాలెం: చిన్న వర్షానికే బుగ్గవాగు పొంగి పొర్లి ప్రవహిస్తుండడంతో రాకపోకలు ఆగిపోతున్నాయని రఘునాథపాలెం మండలం వీఆర్.బంజర గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం సాయంత్రం వరకు వంతెనపై ప్రవాహం ఉండడంతో ఇబ్బందులు ఎదరయ్యాయి. కాగా, డోర్నకల్ - ఖమ్మం మార్గంలో రాకపోకలు నిలిపివేయగా ఎంపీఓ శ్రీనివాసరెడ్డి, గ్రామాల కార్యదర్శులు నాగరాజు, హిమబిందు, పోలీసులు పర్యవేక్షిస్తున్నారు.

● కామేపల్లి: మండలంలోని పొన్నేకల్ బుగ్గవాగు ఉధృతితో లింగాల-డోర్నకల్ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. బుగ్గవాగు వరద ఉధృతిని డీపీఓ ఆశాలత, డీఎల్‌పీఓ రాంబాబు, సీఐ తిరుపతిరెడ్డి, ఎస్సై సాయికుమార్ పరిశీలించారు.

● తల్లాడ: మండలంలో బిల్లుపాడు-రామచంద్రాపురం మధ్య, వెంగన్నపేట-నూతనకల్ మధ్య వాగులు, మిట్టపల్లి, పినపాక వద్ద వాగులు ఉధృత రూపం దాల్చగా రాకపోకలు స్తంభించాయి.

● వైరా రిజర్వాయర్ నుంచి అలుగుల ద్వారా వరద దిగువకు చేరి వైరా నది ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో పలుగ్రామాలకు రాకపోకలు ఆగిపోయాయి. ఎస్సై పుష్పాల రామారావు, ట్రెయినీ ఎస్సై వెంపటి పవన్ స్నానాల లక్ష్మీపురంలోని వైరా నది ఉధృతిని పరిశీలించి ప్రజలను అప్రమత్తం చేశారు.

● కారేపల్లి: మండలంలోని పేరుపల్లి వద్ద లోలెవల్ బ్రిడ్జి పైనుంచి బుగ్గవాగు ప్రవాహంతో రాకపోకలను నిలిపివేశారు. బుగ్గవాగు ఒడ్డున నిర్మించిన డబుల్ బెడ్‌రూం కాలనీలోకి వరద చేరడంతో సీఐ తిరుపతిరెడ్డి, ఎస్ఐ బి.గోపి, ఎంపీడీఓ రవీంద్రప్రసాద్ తదితరులు స్థానికులను హైస్కూల్ పునరావాస కేంద్రానికి తరలించారు. అలాగే, డీపీఓ ఆశాలత, డీఎల్‌పీఓ రాంబాబు పరిశీలించారు. ఇక పలుచోట్ల పత్తిచేన్లలోకి నీరు చేరడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● ఏన్కూరు: మండలంలో భారీ వర్షానికి చెరువులు నిండగా, వాగులు పొంగాయి. జన్నారం- అంజనపురం వద్ద నిమ్మవాగు ప్రవాహంతో రాకపోకలు ఆటంకం ఎదురైంది. లోతట్టు ప్రాంతాల పొలాల్లో వరద నిలిచింది.

● నేలకొండపల్లి: మండలంలోని రాజేశ్వరపురం-శంకరగిరితండా మధ్య రహదారి వరద తాకిడికి కొట్టుకపోయింది. ఇక్కడ బ్రిడ్జి నిర్మించే క్రమాన పక్కన వేసిన రహదారి రాజేశ్వరపురం చెరువు అలుగు ప్రవాహంతో కొట్టుకపోయింది. అలాగే, వరి పొలాలు నీట మునిగాయి. ఈమేరకు పంచాయతీ కార్యదర్శులు రాకపోకలను నిలిపివేసి పహారా ఏర్పాటుచేశారు.


కొణిజర్ల : మల్లుపల్లి - కొణిజర్ల మధ్య పొంగి పొర్లుతున్న పగిడేరు


పేరుపల్లి వద్ద లోలెవల్ బ్రిడ్జిపై బుగ్గవాగు వరద


కొణిజర్ల : రాంపురంలోని ఇళ్లలోకి చేరిన నీరు


వైరారూరల్ : వైరా నది ఉధృతిని పరిశీలిస్తున్న ఎస్సై రామారావు, తదితరులు

అథారిటీతోనే అభివృద్ధి

- ఆశించినస్థాయిలో పురోగతి లేని భద్రాచలం
- శ్రీ సీతారామచంద్రస్వామి వారి భక్తులకు నిత్యం తిప్పలే
- మౌలిక సదుపాయాల కొరతతో స్థానికులకూ తప్పని పాట్లు


భద్రాచలం పట్టణ వ్యూ

భద్రాచలం: దక్షిణ అయోధ్యగా పేరుగాంచినా.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించకపోవడంతో భద్రాచలంలో అభివృద్ధి ముందుకు సాగడం లేదు. శ్రీసీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం, పట్టణం కలిపి లేదా విడివిడిగా ప్రత్యేక అథారిటీ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. భద్రాచలం పట్టణానికి దశాబ్దాల చరిత్ర ఉంది. బ్రిటీష్, నైజాంల కాలంలో నదీ రవాణాకు అనుకూలంగా ఉండడం, రామయ్య కొలువై ఉండడంతో క్రమంగా పట్టణం విస్తరించగా.. జనాభా ప్రస్తుతం లక్ష వరకు చేరింది. అయితే అభివృద్ధిలో మాత్రం జీరోగానే ఉంది. మేజర్ గ్రామపంచాయతీగా వార్షికాదాయం ఎక్కువగానే ఉంది. అయినా వర్షాకాలంలో చినుకుపడితే రోడ్లన్నీ జలమయంగా మారుతాయి. అస్తవ్యస్తమైన డ్రైయినేజీ, భవన, రోడ్ల నిర్మాణానికి సరైన ప్రణాళిక లేకపోవడంతో ఇష్టానురీతిగా అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. ఈక్రమంలో పట్టణాభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ రూపొందించాల్సిన అవసరం ఉంది. మరోవైపు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల విభజనతో భద్రాచలం విస్తీర్ణం తగ్గిపోయింది. ప్రభుత్వ స్థలాలకు కొరత ఏర్పడింది. దీంతో అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు ఒకే చోట సమీకృత భవనం నిర్మించాలని, తద్వారా ఖాళీ స్థలాలను భక్తుల వసతి, ప్రభుత్వ అవసరాలకు వినియోగించాలని పలువురు కోరుతున్నారు.

సత్వర అభివృద్ధి కావాలంటే..

భద్రాచలం దేవస్థానం అభివృద్ధి సైతం ముందుకు సాగడం లేదు. రెండేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్నామని చెబుతున్నా.. అది మాఢ వీధుల విస్తరణ వద్దే ఆగిపోయింది. కొద్ది నెలల క్రితం బడ్జెట్‌లో యాద్రాద్రి టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీకి రూ.200 కోట్లు, వేములవాడ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీకి రూ.100 కోట్లను ప్రభుత్వం ప్రకటించింది. కానీ భద్రాచలానికి డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేయలేదు. ఈ నేపథ్యంలో ఖమ్మం నగర అభివృద్ధికి స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేసిన తరహాలో భద్రాచల పట్టణం, దేవస్థాన అభివృద్ధికి టెంపుల్ అండ్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అథారిటీ ఏర్పాటు పర్యాటకాభివృద్ధికి కూడా దోహం చేస్తుందని చెబుతున్నారు. తగిన సదుపాయాలు కల్పిస్తే ఏజెన్సీలో జలపాతాలు, పాపికొండలకు సందర్శకుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు.

భద్రాచలానికి న్యాయం చేయాలి



భద్రాచలం అభివృద్ధిలో నానాటికీ వెనుకబడిపోతోంది. అస్తవ్యస్తమైన డ్రైయినేజీ వ్యవస్థతో వర్షాకాలంలో అందరం ఇబ్బంది పడుతున్నాం. పట్టణాన్ని ప్రస్తుత, భవిష్యత్ అవసరాలకు సరిపడే విధంగా అభివృద్ధి చేయాలి. ఇందుకోసం ప్రభుత్వం టెంపుల్ అండ్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేయాలి.

-కందుల రాము, స్థానికుడు

మత ఫాసిజాన్ని ప్రతిఘటిస్తేనే వ్యవస్థల పరిరక్షణ

నాస్తిక సమాజ అధ్యయన తరగతుల్లో వక్తలు



అధ్యయన తరగతుల్లో మాట్లాడుతున్న రమేష్

ఖమ్మంమయూరిసెంటర్: దేశంలో పెరుగుతున్న మత ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడి లౌకిక వ్యవస్థను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలు, ప్రజాస్వామ్యవాదులపై ఉందని రిటైర్డ్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం జరిగిన నాస్తిక సమాజ, అధ్యయన తరగతుల్లో ఆయన మాట్లాడారు. కమ్యూనిస్టులు దేశ పరిస్థితినే కాక ప్రపంచ పరిస్థితులను అధ్యయనం చేస్తూ పోరాట పంథా రూపొందించుకోవాలని సూచించారు. భావమే ప్రధానంగా భావించిన వారు భావవాదులుగా, పదార్థమే ప్రధానంగా భావించిన వారు భౌతికవాదులుగా విభజించబడ్డారని చెప్పారు. అయితే, భౌతికవాదమే అన్ని సమస్యలకు పరిష్కారాన్ని చూపించనుండగా, భావవాదం సమస్యల్ని ఇంకా పెంచుతుందని తెలిపారు. దీన్ని గుర్తించిన పాలక వర్గం ప్రజలను మత్తులో ఉంచడానికి మతం, దేవుళ్లను వాడుకుంటోందని వెల్లడించారు. ఈ విషయాన్ని గమనించి ఎవరికివారు తమను తాము ప్రశ్నించుకుంటే విజ్ఞానం వెల్లివిరుస్తుందని విజయ్‌కుమార్ తెలిపారు. అనంతరం 'శాస్త్రీయ దృక్పథం' అంశంపై సీహెచ్.రమేష్, 'వాస్తవాల ఆధారంగా జీవించడం ఎలా?' అన్న అంశంపై బీ.వీ.రాఘవులు మాట్లాడారు. సామాజిక సంబంధమైన విషయాల్లో సత్యాలను బోధించే ఏకైక శాస్త్రం మార్క్సిజం అని పేర్కొన్నారు. ఈ తరగతులకు ఆవుల అశోక్, ప్రీతం అధ్యక్ష వర్గంగా వ్యవహరించగా కన్నెబోయిన అంజయ్య, కోటేశ్వరరావు, చార్వాక, సుధాకర్, క్రాంతి, స్టాలిన్, ఝాన్సీ, శోభ తదితరులు పాల్గొన్నారు.

మొదటి హెచ్చరిక దిశగా..

- మున్నేటికి కాల్వొడ్డు వద్ద 15అడుగుల నీటిమట్టం
- ముంపు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసిన అధికారులు


మున్నేటి వరదను పరిశీలిస్తున్న నాయకులు, బొక్కలగడ్డ వాసులు

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాలో కురుస్తున్న వర్షాలకు తోడు ఎగువ నుంచి వస్తున్న వరద మున్నేటికి పోటెత్తింది. ఈ ఏడాది తొలిసారి కాల్వొడ్డు వద్ద 15అడుగులకు పైగా వరద ప్రవహించింది. శనివారం ఉదయం 9.5 అడుగులుగా ఉన్న నీటిమట్టం అంతకంతకు పెరుగుతూ సాయంత్రం 6గంటల సమయాన 15అడుగులకు చేరడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఇక్కడ నీటిమట్టం 16అడుగులకు చేరితే మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నారు.

అధికారుల పరిశీలన

మున్నేటికి వరద ఉధృతి పెరుగుతుండడంతో మధ్యాహ్నం 12గంటల సమయాన కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, రాత్రి మేయర్ పి.నీరజ కాల్వొడ్డు వద్ద పరిశీలించి అధికారులను అప్రమత్తం చేశారు. ప్రత్యేక అధికారులు, వార్డు ఆఫీసర్లు స్థానికంగా ఉండి ప్రజలను అప్రమత్తం చేసేలా ఆదేశాలు ఇచ్చారు. సాయంత్రం 4.30గంటలకు నీటిమట్టం 14.5 అడుగులకు చేరగా లోతట్టు ప్రాంతాల ప్రజలు పునరావాస కేంద్రాలకు వెళ్లేలా విలువైన వస్తువులు భద్రపరుచుకోవాలని ప్రచారం చేశారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఏదులాపురం మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డితో కలిసి మున్నేటికి ఇరువైపులా పరిశీలించి కార్పొరేటర్లు, ప్రజలు, అధికారులతో మాట్లాడారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలు రాగానే పునరావాస కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. వరద పెరుగుతున్న నేపథ్యాన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచనలు చేశారు. అలాగే, అలాగే, కలెక్టర్ ఆదేశాలతో అన్ని శాఖల అధికారులు మున్నేటి పరీవాహకంలో పర్యవేక్షించారు. కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్, ఎస్ఈ, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్ అధికారులు, పబ్లిక్ హెల్త్ ఇంజనీర్లే కాక అర్బన్, రూరల్ తహసీల్దార్లు, త్రీటౌన్ సీఐ, ఇరిగేషన్ అధికారులు ముంపు ప్రాంతాల్లో కలియదిరుగుతూ ప్రజలను అప్రమత్తం చేశారు. కార్పొరేటర్లు తోట గోవిందమ్మ రామారావు తదితరులు కూడా అధికారుల సూచనలు పాటించాలని, ఆస్తి నష్టం వాటిల్లకుండా ముందుగానే అప్రమత్తం కావాలని ప్రజలకు అవగాహన కల్పించారు.

పునరావాస కేంద్రాలు సిద్ధం..

శనివారం రాత్రి మున్నేటి వరద 17అడుగుల వరకు చేరే అవకాశముందన్న సమాచారంతో అధికారులు క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించారు. కానీ రాత్రి 10గంటల వరకు 15.01అడుగులుగానే నీటిమట్టం కొనసాగింది. అయినా పునరావాస కేంద్రాలను సిద్ధం చేసి ప్రజలను తరలించాల్సి వస్తే అవసరమైన సౌకర్యాలు, వసతులు కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. తొలిదఫా నయాబజార్ జూనియర్ కళాశాల, రామన్నపేట స్కూళ్లలో పునరావాస కేంద్రాలను సిద్ధం చేసి ఉంచారు.

పంది మాంసం దుకాణం సీజ్


షాప్‌ను సీజ్ చేయిస్తున్న కేఎంసీ ఉద్యోగులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం కొత్త బస్టాండ్ పక్కన వెజ్, ఫిష్ మార్కెట్‌లో ఎలాంటి అనుమతి లేకుండా పంది మాంసం షాప్ ఏర్పాటుచేయడంపై కేఎంసీ అధికారులు చర్యలు చేపట్టారు. ఈమేరకు దుకాణాన్ని సీజ్ చేయడంతో పాటు నిర్వాహకుడికి రూ.3వేల జరిమానా విధించారు. శానిటరీ సూపర్‌వైజర్ ఎం.సాంబయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మల్లయ్య, జవాన్ పాల్గొన్నారు.

ట్రాక్టర్ ట్రక్కు చోరీ

చింతకాని: మండలంలోని గోవిందాపురం(ఎల్) గ్రామానికి చెందిన రైతు ధర్మపురి పుల్లారావు ట్రాక్టర్ ట్రక్కు చోరీకి గురైంది. రైతు ఏడాది క్రితం ట్రాక్టర్ ఇంజన్, ట్రక్కు కొనుగోలు చేయగా, ప్రొద్దుటూరులో స్నేహితుడైన పాసంగులపాటి విష్ణువర్ధన్ అవసరాలకు శుక్రవారం పంపించాడు. ఆయన ఇంటి వద్ద శుక్రవారం రాత్రి ట్రక్కు చోరీ కావడంతో శనివారం పుల్లారావుకు సమాచారం ఇచ్చాడు. దీంతో రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

'ఉపాధి' కార్యాలయంలో అగ్నిప్రమాదం


మంటల్లో కాలిపోతున్న కార్యాలయం

ఏన్కూరు: ఏన్కూరు మండల కేంద్రంలోని ఉపాధి హామీ కార్యాలయంలో శనివారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. పథకం ప్రారంభమైనప్పటి నుంచి జరిగిన పనుల రికార్డులు, ఇతర ఫైళ్లు అగ్నిప్రమాదంలో కాలి బూడిదయ్యాయి. అలాగే, బీరువాలు, ఇతర సామాగ్రి కూడా కాలిపోయాయి. మంటలు మొదలైన విషయం తెలియగానే ఏపీఓ సూరయ్య తహసీల్దార్, ఎస్ఐతో పాటు అగ్నిమాపక శాఖకు అధికారులకు సమాచారం ఇచ్చారు. ఇంతలోనే స్థానికులు, రేపల్లెవాడ వాసులు మంటలను ఆర్పే ప్రయత్నం చేస్తుండగా.. అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను అదుపు చేశారు. ఎంపీడీఓ జీవీఎస్. నారాయణ, ఎస్ఐ రఫీ, ఆర్ఐ శ్రీనివాస్ పరిశీలించి వివరాలు సేకరించారు.

బైక్ కొనివ్వలేదని తండ్రిపై గొడ్డలితో దాడి

ఖమ్మంరూరల్: పల్సర్ బైక్ కొనివ్వలేదంటూ ఓ వ్యక్తిపై ఆయన కుమారుడు గొడ్డలితో దాడి చేసిన ఘటన ఇది. ఖమ్మం రూరల్ మండలం మంగళగూడెంకు చెందిన బండారు నాగయ్య – లక్ష్మికి కుమారుడు సతీష్ ఉన్నాడు. ఇటీవల ఆయనకు సెల్‌ఫోన్ కొనిచ్చారు. అనంతరం ఈనెల 13న పల్సర్ బైక్ కొనివ్వాలని కోరగా అంత డబ్బు లేదని, ఏదైనా పని చేసుకుని బైక్ కొనుక్కోవాలంటూ సూచించారు. కానీ సతీష్ మాత్రం బైక్ కొనివ్వకపోతే ఇద్దరినీ చంపుతానంటూ బెదిరించాడు. ఈక్రమంలో 14న రాత్రి అంతా అన్నం తిని పడుకున్నాక అర్ధరాత్రి సమయాన సతీష్ తండ్రి నాగయ్య దాడి చేయడంతో నుదురు, దవడపై తీవ్ర రక్తస్రావమైంది. దాడిని అడ్డుకోబోయిన నాగలక్ష్మికి వెళ్లడంతో ఆమె కేకలు వేయగా ఇరుగుపొరుగు రావడంతో సతీష్ పారిపోయాడు. దీంతో నాగయ్యను ఆస్పత్రికి చేర్పించగా.. నాగలక్ష్మి ఫిర్యాదుతో శనివారం కేసు నమోదు చేసినట్లు సీఐ ముష్క రాజు తెలిపారు.

రిటైర్డ్ ఉద్యోగులకు సకాలంలో బెనిఫిట్లు అందించాలి

- సింగరేణి సీఎండీ బలరామ్ ఆదేశం
- సంస్థ ప్రధాన కార్యాలయంలో అధికారులు, నేతలతో సమావేశం


మాట్లాడుతున్న సీఎండీ బలరామ్, హాజరైన అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో పని చేసి రిటైర్డ్ అయిన ఉద్యోగులకు సకాలంలో బెనిఫిట్లు అందించాలని సీఎండీ ఎన్.బలరామ్ సూచించారు. సీఎంపీఎఫ్ రీజియన్ కమిషనర్‌గా ఇటీవల నియమితులైన వంశీధర్ కుసుంభ శనివారం కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో సీఎండీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ ఉద్యోగులు గతంలో ఏమైనా రుణాలు తీసుకుని ఉంటే నెల రోజుల ముందుగానే వాటిని క్లియర్ చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. అంతేకాక కాంట్రాక్ట్ కార్మికులకు సీఎంపీఎఫ్ పుస్తకాలు అప్‌డేట్ చేయాలని, వారి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని ఆదేశించారు. అంతకుముందు సంస్థ ప్రధాన కార్యాలయంలో బలరామ్ అధ్యక్షతన సీపీఆర్ఎంఎస్ ట్రస్ట్ బోర్డ్ సమావేశం నిర్వహించారు. గతంలో జరిగిన నాలుగు ట్రస్టీలకు సంబంధించిన పోస్ట్ రిటైర్మెంట్ కాంట్రిబ్యుటరీ మెడికల్ స్కీమ్ – నాన్ ఎగ్జిక్యూటివ్ (సీపీఆర్ఎంఎస్- ఎన్ఈ)లకు సంబంధించిన అంశాలపై చర్చించారు. అలాగే, గత ఆర్థిక సంవత్సరం నుంచి ఇప్పటి వరకు మారిన ట్రస్ట్ సభ్యుల స్థానంలో కొత్తవారిని నియమించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈసమావేశంలో డైరెక్టర్(పా) గౌతమ్ పొట్రు, డైరెక్టర్(ఈఅండ్ఎం) సత్యనారాయణరావు, డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వీ.సూర్యనారాయణరావు, డైరెక్టర్(పీపీ) కె.వెంకటేశ్వర్లు, గుర్తింపు సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

Real Estate

FLAT FOR SALE

■ ఖమ్మం బైపాస్‌రోడ్ సప్తపది ఫంక్షన్ హాల్ ఎదురుగా K.V.R. తాత రెసిడెన్సి నందు 5th ఫ్లోర్‌లో 502 కంప్లీట్ ఉడ్‌వర్క్‌తో వున్న 1174 SFT (2BHK) గల ఫ్లాట్ Ph: 93468 40997 [SCA 25007267]

■ శ్రావణమాసం అద్భుతమైన ఆఫర్ ఖమ్మం ప్రశాంతి నగర్ రోడ్ నెం. 4, ఖానాపురంలో సాయి నివాస్ అపార్ట్‌మెంట్‌లో 1250 SFT 44 లక్షలు మాత్రమే. ఈ అవకాశం ఏడు రోజులు మాత్రమే 9246242686, 7396741085 [SCA 25006914]

HOUSE FOR SALE

■ ఖమ్మం, కవిరాజ్‌నగర్ రోడ్ నెం.8లో W/F 275 చ॥గ॥ 30 సం॥ (4 రూమ్స్) గల ఇల్లు అమ్మకానికి కలదు. కొనదలచిన వారు మాత్రమే. సెల్: 9182143914 [SCA25006962]

PLOT FOR SALE

■ ఖమ్మం, రంగనాయకుల గట్టు దగ్గర 100 అడుగుల మెయిన్ రోడ్డుకుగల 150 చదరపు గజాల ప్లాటు అమ్మబడును. Whatsapp Call: సంప్రదించండి. 98490 25144. [SCA 25006942]

వ్యవసాయ భూమి అమ్మకం

■ ఖమ్మం జిల్లా, తల్లాడ (మం॥) ముద్దునూరు గ్రామంలో రిజిస్ట్రేషన్ గల 8 ఎకరాల వ్యవసాయ భూమి అమ్మకానికి కలదు. CELL: 93921 22526 [P-285]

తాజా వార్తల కోసం లాగాన్ అవ్వండి www.sakshi.com

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరదమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Wanted

■ ఖమ్మంలోని వెలాసిటి Net work నందు పనిచేయుటకు సేల్స్ మార్కెటింగ్, టెక్నికల్, స్పెయర్స్-టెలికాలర్స్, హెల్పర్స్ కావలెను. ఫోన్: 99080 22621, 99485 44438 [SCA25007280]

■ విజయవాడలో A/C Rental Events కంపెనీకి డ్రైవింగ్ తెలిసిన హెల్పర్స్, A/C టెక్నీషియన్స్ కావలెను. జీతం:20-25,000/- భో+వసతి+ఫ్రీ ట్రైనింగ్. ✆ 99660 44671 [B-127875]

■ షిరిడిసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో లేడి వార్డెన్స్, లేడీ సూపర్ వైజర్స్, నర్సులు, ఆయాలు, భార్యభర్తలు కావలెను. ఫోన్: 8985114453, 9391036931 [HA-16124]

■ తన్మయీ ఓల్డేజ్‌హోమ్, విజయవాడ. పెద్దవారికి సేవచేయుటకు అనుభవంగల ఆడా, మగ వర్కర్లు, వంటమనుషులు కావలెను. వ॥20- 50 సం. 9652423559, 7093911010, 9573000987 [HA-406]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి
వివరాలకు : ఖమ్మం : 9705444182 9010299957

మీ చిన్నారులకు 'సాక్షి' ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయండి...
నమూనా ప్రకటన



సైజ్: 3.8 cm. x 5 cm. రూ॥ 500/- మాత్రమే
మరిన్ని వివరములకు మా ప్రతినిధిని సంప్రదించండి.
5% GST అదనం.